క్లుప్తంగా

ప్రజలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు భోగభాగ్యాలతో, సుఖసంతోషాలతో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను జరుపుకోవాలని కోరారు. అలాగే దూరప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే వారంతా సురక్షిత ప్రయాణాలు చేసి తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.

వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



స్వామివారి ఆలయంలో భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారిని, పద్మావతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వీవీ అప్పలాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత సేవ, మంగళాశాసనం, శాత్తుముర్రై, తీర్థఘోష్టి, బాలభోగం, పుణ్యాహవాచనం, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం మండలంలోని దళాయివలసకు చెందిన గులిపల్లి శ్రీనివాసనాయుడు, నారాయణమ్మ దంపతుల సహకారంతో ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. శ్రీరామ భజన మండలి సభ్యులు స్వామివారిని కీర్తిస్తూ భజన గీతాలు ఆలపించారు. భోగి పండగ, ధనుర్మాస ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం ఆలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మర్రాపు సత్యనారాయణ, కమిటీ సభ్యులు తెలిపారు.

'బడి నుంచి పొలంబడి' వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న రచయితలు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యతనిస్తూ పూర్వ ప్రాథమిక విద్యాస్థాయి నుంచి ఒకటో తరగతి వరకు విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలను గేయాలు, పాటలు, కథలుగా రూపొందేందుకు కృషిచేస్తున్నట్లు జట్టు ట్రస్ట్ నిర్వాహకుడు డా. పారినాయుడు తెలిపారు. జట్టు ట్రస్ట్‌లో 'బడి నుంచి పొలంబడి' ప్రాజెక్టులో భాగంగా పలువురు రచయితలతో శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. తెలుగు, ఆంగ్లంలో పాటలు, గేయాలు, కథలను రచించడం ద్వారా ప్రకృతి వ్యవసాయ పాఠాలు దేశం నలుమూలల విస్తృతం చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రచయితలు రౌతు వాసుదేవరావు, బి.భీమేశ్వరరావు, కె.శివకేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల సంచారంపై అప్రమత్తం



తాలాడలో గోడలపై పోస్టర్లు అంటిస్తున్న అటవీశాఖ సిబ్బంది

భామిని: మండలంలోని పలు గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తుండటంతో అటవీశాఖ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ మేరకు శనివారం బాలేరు, సొలికిరి, తాలాడ, ఘనసర, ఘనసర కాలనీ, కీసర, కోసలి, అత్తికొత్తూరు గ్రామాల్లో అటవీశాఖ సిబ్బంది బృందాలుగా ఏర్పడి మైక్‌లో ప్రచారం చేస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రస్తుతం నాలుగు ఏనుగుల గుంపు వంశధార నదీ తీరంలోని తాలాడ ఐలమ్మ తోట పరిసరాల్లో సంచరిస్తున్నట్లు తెలిపారు. ఏనుగులను కవ్వించడం, రెచ్చగొట్టడం వంటివి చేయొద్దని ఎఫ్‌బీఓలు లక్ష్మణమూర్తి.లక్ష్మీనారాయణ కోరారు. పండగకు వచ్చే బంధువులు, స్నేహితులను ఈ మేరకు అప్రమత్తం చేయాలని సూచించారు.

పేకాట, కోడి పందాలు నిషేధం



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ పాపారావు

బలిజిపేట: సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో పేకాటలు, కోడి పందాలు ఆడేవారిని శిక్షించడం జరుగుతుందని ఎస్‌ఐ పాపారావు తెలిపారు. వీటి నిర్వహణకు ఎక్కడా అనుమతులు లేవని తెలిపారు. పేకాటలు, కోడి పందాలు ఆడి గ్రామాల్లో ఘర్షణ వాతావరణం సృష్టించి అల్లర్లకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన శిక్షలు తప్పవని తెలిపారు. ప్రశాంతంగా ఉండే వాతావరణంలో అల్లర్లు సృష్టించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మురళీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్కారు వారి బడి



నాడు-నేడులో రూపుదిద్దుకున్న వాటపాగు ప్రభుత్వ పాఠశాల



పాలకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని, పేదరికం చదువుకు అడ్డు కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారు. ఏ చింతా లేకుండా విద్యార్థులు చదువుకునేలా వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పించింది. తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, లైట్లు, బెంచీలు, బ్లాక్‌బోర్డులు, డిజిటల్ లైబ్రరీలు, ప్రహరీలు, తదితర అన్ని వసతులను ఏర్పాటు చేసింది. పిల్లల చదువుల భారం తల్లిదండ్రులపై పడకుండా ప్రభుత్వమే 'జగనన్న విద్యా కానుక' పేరుతో పుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు, షూ, యూనిఫాం, తదితర సామగ్రితో పాటు, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 'జగనన్న గోరుముద్ద' పేరుతో నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తోంది. సర్కారు బడుల్లో ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు.

పాలకొండ నియోజకవర్గంలో..

మొత్తం పాఠశాలలు:	356
నాడు-నేడు ద్వారా ఆధునికీకరించినవి:	205
నాడు-నేడు కోసం చేసిన ఖర్చు:	రూ.1280.51 కోట్లు
పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య:	1284
విద్యార్థుల సంఖ్య:	33,517
పెరిగిన విద్యార్థుల సంఖ్య:	1871

తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతుండడంతో ప్రవేశాలు పెరిగాయి.



అబ్బురపరిచేలా లుంబూరు ప్రాథమిక పాఠశాల (ఇన్‌సెట్లో) సర్వాంగ సుందరంగా అన్నవరం ప్రభుత్వ పాఠశాల

తెట్టంగిని ఆదర్శంగా తీర్చిదిద్దాం..

- రూ.2.93 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం..
- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



తెట్టంగిలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామానికి ఎంతో చారిత్రక గుర్తింపు ఉందని, ఈ గ్రామంలో సుమారు రూ.2.93 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2017 సెప్టెంబరు 11న గ్రామానికి అప్పటి సీఎం చంద్రబాబునాయుడు వచ్చి అనేక హామీలు ఇచ్చారని, కానీ ఏ ఒక్కటీ నెరవేర్చకుండా ఇక్కడి ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక తెట్టంగి గ్రామం ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు. గ్రామంలో రూ.80 లక్షలతో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌ను నిర్మించినట్లు చెప్పారు. రూ.61 లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మించామన్నారు. అలాగే జలజీవన్ మిషన్ నిధులు రూ.9.50 లక్షలతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశామని, ఆర్‌సీఎం చర్చ్‌వీధి, సీబీఎం చర్చివీధి, బంగారుతల్లి వీధితో పాటు పలు శ్మశాన వాటికల్లో రూ.3.65 లక్షలతో బోరుబావులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సుమారు కోటి రూపాయలతో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించామని, గడపగడపకు కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం సహాయ నిధి నుంచి గ్రామానికి చెందిన నలుగురికి వైద్యఖర్చుల కోసం రూ.1.60 లక్షలు అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, సర్పంచ్ అలజంగి విజయమ్మ, ఎంపీటీసీ సతివాడ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు పరిసినాయుడు, సతివాడ చిన్నంనాయుడు, కర్రి గోవిందరావు, శిష్టు మధుసూదనరావు, వైశ్యరాజు గోవిందరాజు, పాలవలస ధవళేశ్వరరావు, నీలం సత్యంనాయుడు, రణస్థలం రాంబాబు పాల్గొన్నారు.

'హెల్పింగ్ హ్యాండ్స్' సాయంతో..



శ్లాబ్ వేయిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంఘం సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: సీఆర్టీగా పనిచేస్తూ అనారోగ్యంతో అకాలమరణం పొందిన గుమ్మలక్ష్మీపురం గ్రామం కొండవీధికి చెందిన కిల్లక రవికుమార్ సొంతింటి కల సాకారానికి స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ సంఘం బాసటగా నిలిచింది. నిరుపేద అయిన రవికుమార్ సీఆర్టీగా తనకు వచ్చే జీతంతో సొంతిల్లు కట్టుకోవాలని కలలు కన్నాడు. అయితే ఆరు నెలల కిందట ఆయన మరణించడంతో సొంతింటి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అయితే అందరితో ఎంతో కలివిడిగా ఉన్న రవికుమార్ సొంతింటి కలను సాకారం చేయాలని గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు భావించారు. సుమారు రూ.1.30 లక్షలు విరాళాలు సేకరించి నిర్మాణ పనులు పునఃప్రారంభించారు. త్వరలోనే ఆ ఇంటిని రవికుమార్ కుటుంబీకులకు అప్పగించనున్నట్లు వారు తెలిపారు.

పథకాలపై అవగాహన కల్పించేందుకే..



వికసిత్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వాటిని అర్హులకు చేరవేయడమే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఉరిటి రామారావు తెలిపారు. మండలంలోని మరుపెంట గ్రామంలో శనివారం ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు ఆధ్వర్యంలో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. పథకాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు ఈనెల 25 వరకు మొబైల్ వాహనాల ద్వారా ప్రచారం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర టీం సభ్యులు గఫూర్, విల్సన్, సర్పంచ్ ఉరిటి నిర్మల, కార్యదర్శి భాస్కరరావు, రామకృష్ణ తదితరులున్నారు.

● మంచు కురిసే వేళలో..



పాలకొండ పట్టణంతో పాటు పరిసర గ్రామాలపై శనివారం మంచు దుప్పటి పరచుకుంది. ఉదయం 8 గంటల వరకు పొగమంచు దట్టంగా కురవడంతో ప్రజలు, వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. సీతంపేట, శ్రీకాకుళం, వీరఘట్టం రహదారుల్లో అలుముకున్న మంచు మబ్బులు చూపర్లను ఆకట్టుకున్నాయి.
పాలకొండ రూరల్:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి, సామన్య ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయని రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరుశెట్టి గిరిబాబు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గిరిశిఖర గ్రామల్లో రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని, లక్షల మంది నిరుద్యోగులకు గ్రామ సచివాలయాల్లో, ఇతర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు లభించాయన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేశారన్నారు. సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే చేరుతున్నాయన్నారు. మారుమూల గ్రామాలకు కూడా రోడ్డు సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక్క గిరిజన గ్రామానికి కూడా రోడ్డు వేయలేని టీడీపీ నాయకులకు నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



కురుపాం: మంతినివలసలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: మండల కేంద్రంలోని ప్రదీప్‌నగర్ కాలనీకి చెందిన దాసరి మహాలక్ష్మి(85), మంతినివలసకు చెందిన కాకుల పద్మ(35) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శనివారం పరామర్శించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కురుపాం సర్పంచ్ గార్ల సుజాత, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, ఎంపీటీసీలు సంతోషిరాణి, వెలమల బంగారునాయుడు, మాజీ వైస్ ఎంపీపీ వంజరాపు కృష్ణ, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ ఆదిల్, ఆకుల శ్రీధర్ పాల్గొన్నారు.

కొమరాడ: మండలంలోని గుణానపురం గ్రామ సర్పంచ్ మిరయాల పద్మావతి భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు మిరయాల సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శనివారం ఆ గ్రామానికి వెళ్లి సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్టీ తరఫున ఆ కుటుంబానికి అండగా ఉంటామని, అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.



పాలకొండ: శివప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పరామర్శ

పాలకొండ: మండలంలోని అర్ధలి గ్రామ మాజీ సర్పంచ్ నల్లి కృష్ణంనాయుడు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం అర్ధలి గ్రామానికి వెళ్లి కృష్ణంనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన కుమారులు నల్లి శివప్రసాద్ (నాగవంశపు కార్పొరేషన్ డైరెక్టర్), నల్లి ధర్మారావు (సీనియర్ జర్నలిస్ట్)లను పరామర్శించి ఓదార్చారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కనపాక సూర్యప్రకాశరావు, పాలవలస ధవళేశ్వరరావు, కోరాడ రవికుమార్, తదితరులు ఉన్నారు.



భామిని: నేరడి-బిలో మట్టి కుండలు కొనుగోలు చేస్తున్న మహిళలు



భామిని: గోడలపై భోగి పిడకలు ఆరబెడుతున్న చిన్నారులు

గ్రామాల్లో సంక్రాంతి సందడి

భామిని/గరుగుబిల్లి/జియ్యమ్మవలస: తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి వచ్చేసింది. వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వలస జీవులన్నీ పండగకు సొంతూళ్లకు చేరుకోవడంతో బంధువులు, స్నేహితులతో ఊళ్లన్నీ సందడిగా కనిపిస్తున్నాయి. భోగి, సంక్రాంతి పండగకు కావాల్సిన సరుకులు, నూతన వస్త్రాల కొనుగోళ్లతో మార్కెట్లు కొత్తశోభ సంతరించుకున్నాయి. గంగిరెద్దుల వారి సన్నాయి వాయిద్యాలు, హరిదాసుల కీర్తనలు, జంగమ దేవరల గంటారావాలతో గ్రామాలు మార్మోగుతున్నాయి. పిండి వంటలతో ఇళ్లన్నీ ఘుమఘుమలాడుతున్నాయి.

భోగి మంటలకు కలప సిద్ధం

భామిని: భోగిపండను ఘనంగా జరుపుకునేందుకు గ్రామాల్లో చిన్నారులు, యువత సిద్ధమయ్యారు. యువకులు కలప పెద్ద ఎత్తున సేకరించి భోగి మంటకు సిద్ధం చేశారు. చిన్నారులు ఆవుపేడతో భోగి పిడకలు తయారు చేసి, వాటిని దండలుగా కట్టారు. ఆదివారం వేకువజామున భోగి మంటలు వేయనున్నారు.

ఆ రెండు గ్రామాలు దూరం..

భామిని మండలంలోని రెండు గ్రామాలు భోగి మంటలకు దూరంగా ఉంటాయి. సింగిడి(ఎస్), గురండి(ఎస్) గ్రామాల్లో తరాలుగా భోగి మంటలకు నోచుకోలేదు. పర్లాఖిమిడి, జయపూర్ జమిందారుల శాసనం గ్రామాలుగా, బ్రాహ్మణులకు కేటాయింపు గ్రామాలుగా సింగిడి, గురండి గ్రామాలు ఏర్పాటు కావడంతో ఈ రెండు గ్రామాల్లో భోగి మంటల ఆచారం లేదని గ్రామ పెద్దలు చెప్పారు.



గరుగుబిల్లి: పెద్దూరులో హరిదాసు కీర్తనలు



గరుగుబిల్లి: గరుగుబిల్లిలో గంగిరెద్దు సన్నాయి



భామిని: ఇంటి ముందు పెద్దలను పొగుడుతున్న జంగం దేవర



భామిని: పిండి వంటలు చేస్తున్న కుటుంబం

అయోధ్య అక్షతల పంపిణీ

బలిజిపేట: వెంగాపురం రామాలయంలో భక్తులకు అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను శనివారం పంపిణీ చేశారు. ధనుర్మాసం సందర్భంగా ఆలయం వద్ద అక్షతలు, పుస్తకాలను పంపిణీ చేశారు. వీటి ప్రత్యేకత గురించి భక్తులకు అర్చకులు గోపాలకృష్ణ వివరించారు. కార్యక్రమంలో అర్చకులు కె.సూర్యనారాయణ, కె.ఫణికుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారికి తిరువీధి

సీతానగరం: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సీతానగరం, బగ్గందొరవలస, కేఎస్ పురం, కృష్ణారాయపురం, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గోవింద మాలాధారణ భక్తులు పల్లకిలో స్వామివారిని ఊరేగించారు. నగర సంకీర్తన, మేల్కొలుపు, భజన పాటలతో తిరువీధి నిర్వహించారు. వేణుగోపాలస్వామి, గోదాదేవి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.